

చాటుగా చేరిపో...
కాకినాడ జిల్లాలోని పోలీసుల తెరచాటు చేరికలు పలు సందేహాలకు తావిస్తున్నాయి. పోలీసుశాఖలో దిగువ కేడర్‌కు చెందిన పోలీసుల చేరికలంటేనే పెద్ద తతంగం నడుస్తుంటుంది.
8లో



పచ్చని సిరులు
పీతల చెరువుల పెంపకంలో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కాకినాడ విశ్రాంత మత్స్యశాఖ డీడీ రామ్మోహనరావు అన్నారు.

కర్మఫల రూపమే అదృష్టం



అదృష్టమంటే కనపడనిది, కర్మఫల రూపమే అదృష్టమని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. మంగళవారం కొంతమూరులోని వల్లభ గణపతి ఆలయం వద్ద ఉన్న ప్రవచన మందిరంలో ఆయన ఆరో రోజు కల్కి వైభవంపై ప్రవచనాన్ని కొనసాగించారు.
8లో

న్యూస్‌రీల్

అమలులోకి సత్యదేవుని అంతరాలయ దర్శనం



సత్యదేవుని దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

అన్నవరం: సత్యదేవుడు, అమ్మవారు, శంకరుల అంతరాలయ దర్శనం మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. రూ.200 టికెట్‌తో స్వామివారి అంతరాలయంలో ఎడమవైపు ద్వారం నుంచి లోపలకు వెళ్లి స్వామి దర్శనానంతరం కుడి వైపు ద్వారం నుంచి వెలుపలకు వచ్చేలా పాత పద్ధతిని పునఃప్రారంభించారు. శని, ఆదివారాల్లో కూడా ఈ దర్శనం అమలు కానుంది. దీంతో సాధారణ రోజుల్లోనూ నిత్యం దేవస్థానానికి రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలకు పైగా ఆదాయం వచ్చే వీలుంది. పర్వదినాలలో ఇంకా ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ఏలేరుకు 18,708 క్యూసెక్కుల రాక



ఏలేరులో ప్రస్తుత నీటినిల్వలు

ఏలేశ్వరం: అల్పపీడనం బలహీనపడడంతో ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు తగ్గడంతో దిగువప్రాంతానికి నీటి విడుదల స్వల్పంగా తగ్గించారు. ప్రస్తుతం ఎగువప్రాంతం నుంచి 18,708 క్యూసెక్కులు ప్రాజెక్టులో చేరుతోంది. దీంతో ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 85.56 మీటర్లు, 24.11 టీఎంసీలకు 22.09 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దిగువ ప్రాంతానికి 19,635 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దిగువ ప్రాంతానికి సుమారు 4 వేల క్యూసెక్కుల నీటి విడుదల తగ్గించారు. విశాఖకు 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

జాతీయ రహదారి మూసివేత, ట్రాఫిక్ మళ్లింపు

పిఠాపురం: పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో మంగళవారం సాయంత్రానికి వరద ఉధృతి భారీగా పెరిగింది. దీంతో కత్తిపూడి నుంచి పిఠాపురం మధ్య 216వ నంబర్ జాతీయ రహదారిని మూసి వేశారు. కత్తిపూడి నుంచి వచ్చే వాహనాలను అక్కడే నిలిపివేసి ఇతర మార్గాల ద్వారా మళ్లిస్తున్నారు. ఇటు పిఠాపురంలో వాహనాలను నిలిపివేసి బీచ్ రోడ్డు మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు. బుధవారం ఉదయానికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశాలు ఉండడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

రేపు కాకినాడ ఐటీఐలో జాబ్ మేళా

రాయవరం: కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 12న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎంవీజీ వర్మ తెలిపారు. ప్రముఖ కంపెనీలైన ఐటీసీ లిమిటెడ్ హైదరాబాద్, అమరరాజా గ్రూప్ ఇండస్ట్రీస్ తిరుపతి, రానే ఇంజిన్ వల్వేస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ తదితర కంపెనీల్లో ఉద్యోగులను నియమించేందుకు ఐటీఐ ఫైనల్ ఎగ్జామ్స్ రాసిన విద్యార్థులు, పాస్ అయిన విద్యార్థులు జాబ్ మేళాకు హాజరుకావచ్చన్నారు. ఐటీఐ ఫైనల్ ఎగ్జామ్స్ రాసిన విద్యార్థులు అన్ని ట్రేడ్‌ల వారికి ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, సివిల్, ఇన్‌స్ట్రుమెంటల్ మెకానిక్, ఎలక్ట్రానిక్, ఏసీ, వెల్డర్, మెకానిక్ డీజిల్ తదితర ట్రేడ్‌లలో విద్యార్థులకు సుమారు 400 ఖాళీలను భర్తీ చేయనున్నట్టు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అర్హత ఉన్నవారు ఈ జాబ్ మేళాకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ వర్మ తెలిపారు.

13 నుంచి అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

అన్నవరం: ఈ నెల 13వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వీరభద్రస్వామి, కార్యదర్శి వి.సీతాపతి రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 జిల్లాల నుంచి బాలబాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. స్థానిక దేవస్థానం జూనియర్ కళాశాల మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. 15వ తేదీ సాయంత్రం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జట్లను ప్రకటిస్తారని వారు తెలిపారు.

వరదార్పణం



పిఠాపురం మండలం రాపర్తి రాయవరం - భోగాపురం గ్రామాలను ముంచెత్తిన వరద

- కొంప ముంచిన ఏలేరు
- పొంగి ప్రవహిస్తున్న సుద్దగెడ్డ, గొర్రిఖండి, పీబీసీ
- నాలుగు నియోజకవర్గాలు నీట మునక
- జలదిగ్బంధంలో లోతట్టు గ్రామాలు
- 75 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఎంత నష్టం.. ఎంత కష్టం.. రెక్కలు ముక్కలు చేసుకుని ఆరుగాలం శ్రమించి పండించిన పంటలన్నీ ఏలేరు వరద ఎత్తుకుపోయిందని రైతులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఏలేరు పరీవాహక ప్రాంతాల్లో రైతుల గోడు వింటే గుండె తరుక్కుపోతోంది. ఏలేరు రైతుకు దెబ్బమీద దెబ్బ తగిలింది. నిన్నగాక మొన్న వచ్చిన వర్షాలతో కొద్దో గొప్పో మిగిలిన పంటలు కూడా తాజా వరదతో కొట్టుకుపోయాయి. ఈ జలాశయం పరిధిలో ఏ మూల వరి పొలాలు చూసినా చెరువులను తలపిస్తున్నాయి. పెట్టిన పెట్టుబడులన్నీ ఏలేరు వరదార్పణం అయిపోయినట్టేనని రైతులు గగ్గోలు పెడుతున్నారు. నిన్న మొన్నటి వరకూ వరి ఇతర వాణిజ్య పంటలపై గంపెడాశలు పెట్టుకున్న మెట్ట ప్రాంత రైతులు వరదలతో కుదేలయ్యారు.



పిఠాపురం మండలం జములపల్లిలో కూలిన భారీ వృక్షం

నీట మునిగిన పొలాలు

ఏలేరు వరద ముప్పుతో జిల్లా వ్యాప్తంగా 75 వేల ఎకరాల వరి పంట నీట మునిగిందని జిల్లా యంత్రాంగం ప్రాథమికంగా అంచనాకు వచ్చింది. ఒక్క ఏలేరు ప్రాజెక్టు పరిధిలోనే 50 వేల ఎకరాలు నీట మునిగాయి. వరితో పాటు మినుము, ప్రత్తి, మొక్కజొన్న, కూరగాయల వంటి వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంటలతో పాటు పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని పల్లపు, లోతట్టు గ్రామాలు ముంపులో చిక్కుకున్నాయి. పలు ప్రాంతాల్లో కాజ్‌వేలు పొంగి ప్రవహిస్తూ దిగువన ఉన్న పంట పొలాలతో పాటు గ్రామాలకు గ్రామాలనే ముంచెత్తాయి. చాలా చోట్ల గట్లకు గండ్లు పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉగ్రరూపం దాల్చిన ఏలేరు, సుద్దగడ్డలతో దాదాపు కాలనీలు నీట మునిగాయి. వరద నీటితో ప్రధాన రహదారులు ముంపులో ఉండటంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కత్తిపూడి–దిగమర్రు 216 జాతీయ రహదారి మీదుగా చేబ్రోలు టోల్ ప్లాజా వద్ద వరద నీరు ప్రవహిస్తూ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నిలిచిన రాకపోకలు

పెద్దాపురం మండలాన్ని ఏలేరు వరద ముంచెత్తింది. మండలంలోని కాండ్రకోట దబ్బకాలవ గండితో కాండ్రకోట సిరివాడ గుడివాడ నుంచి పెద్దాపురం వెళ్లే ప్రధాన రహదారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జె.తిమ్మాపురం, తూరుపాకలు, కట్టమూరు, కాట్రావులపల్లి గ్రామాల రైతుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరద మరింత ఉధృతం కావడంతో తాటిపర్తి, వడ్లమూరు, చంద్రమాంపల్లి, మర్లావ గ్రామాల్లో గట్లకు గండ్లుపడి పంట పొలాలు మునిగిపోయాయి. కాండ్రకోట దబ్బ కాలవ రెగ్యులేటర్ వద్ద గేటు ఎత్తితే మర్లవ గ్రామానికి వరద ముంపు తగ్గుతుందని వెంటనే గేట్లు ఎత్తాలని అక్కడి రైతులు ఆందోళనకు దిగారు. మరో రెండు రోజుల పాటు ఇవే పరిస్థితులు కొనసాగుతాయని అధికారులు స్థానికులకు చెబుతున్నారు. వరద ఉధృతితో ఒక్క కిర్లంపూడి మండలంలోనే సుమారు 10 వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ఏటిపట్టు గ్రామాలు నీట మునిగాయి. రాజుపాలెంలో ఏలేరు కాలువ గట్టుకు గండి పడి రాజుపాలెం, ముక్కొల్లు పంట పొలాలతో పాటు గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. భూపాలపట్నం గ్రామానికి ఎగువన ఏటిగట్టుకు గండిపడడంతో భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, శృంగరాయుని పాలెం, వీరవరం గ్రామాలు నీట మునిగాయి. ముంపుతో స్థానికులు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు ముంపు గ్రామాల ప్రజలకు ఎగువ ప్రాంతాల్లో వసతి గృహాలు ఏర్పాటు చేసినప్పటికీ గ్రామస్తులు వెళ్లేందుకు ఆసక్తి చూపలేదు. చివరకు అధికారులు ట్రాక్టర్లపై వెళ్లి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.



నీట మునిగిన భూపాలపట్నం

ఏలేరు అదనపు జలాలతో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలు జలమయంగా మరాయి. చుట్టూ నీరు తప్ప ఏమీ కనిపించక గొల్లప్రోలు ప్రజలు కన్నీటిపర్యంతం అవుతున్నారు. దాదాపు పిఠాపురం పరిసర ప్రాంతాలు ఇదే పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఏలేరు శివారు ప్రాంతమైన కొత్తపల్లి వరద ఉధృతికి అతలాకుతలమైంది. ఈ నియోజకవర్గంలో సుమారు 20 వేల ఎకరాల వరి, 10 వేల ఎకరాల వాణిజ్య పంటలు వరద ముంపులో నానుతున్నాయి. ఇంకా రెండు రోజుల పాటు వరద తీవ్రత కొనసాగనుండడంతో పంటలు పనికి రాకుండా పోతాయని రైతులు లబోదిబోమంటున్నారు. గొల్లప్రోలు ఈబీసీ కాలనీ, ఎస్సీ, సూరంపేట, లోతట్టు కాలనీలు ముంపులో ఉన్నాయి. స్థానికులు బయటకు వచ్చేందుకు వేరే దారి లేకుండా పోయింది. గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద 216 జాతీయ రహదారిని వరద నీరు ముంచెత్తడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు దగ్గరుండి ముందు జాగ్రత్తగా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. వరద నీరు మరింత పెరిగే అవకాశం ఉండడంతో ఇప్పటికే నీట మునిగిన గొల్లప్రోలు, పిఠాపురం మండలాలపై మరింత ప్రభావం చూపుతాయంటున్నారు. విరవాడ, విరవ, మంగితుర్తి, కోలంక, ప్రత్తిపాడు, భోగాపురం, రాయవరం, రాపర్తి, గొల్లప్రోలు నగర పంచాయతీ, తాటిపర్తి, చెందుర్తి, వన్నెపూడి, చేబ్రోలు తదితర గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. గొల్లప్రోలులో పాఠశాలలు వరద నీటిలో మునిగిపోవడంతో విద్యార్థులు అష్టకష్టాలు పడి తరగతులకు హాజరవ్వగా మధ్యాహ్నం నుంచి జిల్లా కలెక్టర్ షణ్మోమోహన్ సెలవు ప్రకటించడంతో తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకువెళ్లారు.



గొల్లప్రోలులో నీటమునిగిన ఎస్సీ పేట



కృష్ణవరంలో వరద నీటితో ఉరకలేస్తున్న ఏలేరు కాలువ



నీటమునిగిన గొల్లప్రోలు మండలం తాటిపర్తి రోడ్డు



గొల్లప్రోలులో నీట మునిగిన 216 జాతీయ రహదారిపై ప్రయాణికులను దాటిస్తున్న పోలీసులు

వరద బాధితులను ఆదుకోండి

- వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన

పిఠాపురం: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎంపీ వంగా గీత కోరారు. ఏలేరు వరద ముంపు ప్రాంతాలైన గొల్లప్రోలు నగర పంచాయతీ, సూరంపేట, గొల్లప్రోలు ఇందిరానగర్, గొల్లప్రోలు వైఎస్సార్ కాలనీల్లో మంగళవారం ఆమె పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ముంపు బాధిత ప్రజలతో మాట్లాడి వారు చెప్పిన సమస్యలను స్థానిక రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రెండు రోజుల్లో ఏలేరు వరద మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద కారణంగా అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే ఊళ్లకు ఊళ్లు నీట మునగడంతో ప్రజలు బయటకు వచ్చే అవకాశాలు లేవని, వారికి నిత్యావసర వస్తువులు, తాగునీరు అందేలా చూడాలన్నారు. బాధిత ప్రజలను అన్నిరకాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గత రెండు రోజుల నుంచి ఏలేరు నుంచి అదనపు జలాలు భారీగా విడుదల అవుతుందన్న అధికారిక సమాచారంతో పిఠాపురం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. ఏలేరు పరివాహక ప్రాంతం ప్రజలందరూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ తరఫున అన్ని విధాలా బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.



గొల్లప్రోలులో వరద బాధితులతో మాట్లాడుతున్న వంగా గీత తదితరులు

వరద పరిస్థితిపై కంట్రోల్ రూమ్‌లు

క్షేత్ర స్థాయిలో అధికారుల నియామకం : కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: గత నెల 31 నుంచి జిల్లాలో భారీ వర్షాలు, వరదల పరిస్థితిని వీక్షించేందుకు కలెక్టర్ కార్యాలయంలో 1800 425 3077 టోల్‌ఫ్రీ నంబర్‌తో పాటు డివిజనల్ కార్యాలయాలు, 21 మండల తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం రాత్రి తెలిపారు. క్షేత్ర పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు మండల ప్రత్యేక అధికారులను నియమించినట్టు తెలిపారు. ప్రజలు, మత్స్యకారుల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇళ్లు, కాలనీల్లోకి నీటి ప్రవాహాన్ని తగ్గించేందుకు అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గొల్లప్రోలు మండల గ్రామాల్లో ముంపునకు గురయ్యే ప్రాంతాలను సందర్శించి సంబంధిత శాఖలకు అవసరమైన సూచనలు జారీ చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను తరలించడానికి రోడ్లు, ఇతర అవసరాల కోసం పొక్లెయినర్లు, జేసీబీలు, ట్రాక్టర్లు, వ్యాన్లు, లారీలు, పడవలు, టిప్పర్లు సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. వరద ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను తరలించేందుకు ఏడు బోట్లు, ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఆరోగ్య కిట్లు, వైద్య బృందాలు, తాగునీరు, ఎలక్ట్రికల్ సిబ్బందిని సిద్ధంగా ఉంచామన్నారు. ఇసుక సంచులతో గట్లను బలోపేతం చేయడం, ప్రజల భద్రత కోసం ఏలేరు రిజర్వాయర్‌లో నీటి ప్రవాహ నియంత్రణ, గండ్లను నిరోధించి గట్లను పటిష్ఠం చేస్తున్నామన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు, ఆహార సరఫరా, గర్భిణులకు ఆహార సరఫరా, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, ఆర్మీ, పౌర సరఫరాల శాఖ ద్వారా అవసరమైన వస్తువుల కిట్లను సంసిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గొల్లప్రోలు మండలం జగనన్న కాలనీలో ఐదు వేల కిట్లలో 300 కిట్లు గొల్లప్రోలు మండలం, సూరంపేట గ్రామంలో 300 కిట్లు, సామర్లకోట పట్టణంలో 80 కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. నష్టాలను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని పేర్కొన్నారు.

విద్యా సంస్థలకు సెలవు

అలాగే బుధవారం పిఠాపురం, యు.కొత్తపల్లి, గొల్లప్రోలు, కిర్లంపూడి మండలాల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు.

లాక్ చూస్తే లూటీ

- పగలు రెక్కీ.. రాత్రి నక్కి...
- ఇళ్లు కొల్లగొడుతున్న నలుగురి అరెస్టు
- 21 కేసుల్లో సుమారు రూ.1.45 కోట్ల సొత్తు చోరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా గడిచిన రెండేళ్లలో భారీ చోరీలకు పాల్పడిన నలుగురు నిందితులను సోమవారం రాత్రి అరెస్టు చేసినట్టు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం తెలిపారు. సర్పవరం భావనారాయణ స్వామి ఆలయం సమీపంలో పట్టుబడిన 30 ఏళ్ల లోపు ఉన్న ఆ యువకుల గురించి ఆయన వివరిస్తూ 21 ఇళ్లను కొల్లగొట్టిన వీరిపై 21 కేసులు నమోదు కాగా, సుమారు రూ.1.45 కోట్ల విలువైన సొత్తును వీరు దోచుకున్నారన్నారు. పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి వేళ గోడలు దూకి ఇంటి ప్రాంగణాల్లోకి వెళ్లి తాళాలు బద్దలుకొట్టి ఇళ్లల్లోకి ప్రవేశించి అరగంటలో పని ముగించేస్తారన్నారు.

రూ.96 లక్షలే రికవరీ..

రూ.1.45 కోట్ల విలువైన బంగారం, వెండి నగదు దోచేసిన వారి నుంచి పోలీసులు రూ.96 లక్షలు విలువైన సొత్తును రికవరీ చేశారు. 1200 గ్రాముల బంగారం, 11 కిలోల వెండి, ఓ ద్విచక్రవాహనాన్ని వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. సర్పవరం పోలీసు స్టేషన్ పరిధిలో 11, తిమ్మాపురం పరిధిలో 4, ఇంద్రపాలెం పరిధిలో 2, సామర్లకోట, పెద్దాపురం, కాకినాడ టూ టౌన్, త్రీ టౌన్ పోలీసు స్టేషన్ల పరిధుల్లో ఒకొక్కటి చొప్పున కేసులు నమోదయ్యాయి.

కాకినాడ, రాజమహేంద్రవరానికి చెందినవారే..

కాకినాడ సాంబమూర్తి నగర్‌కు చెందిన 27 ఏళ్ల టేకుమూడి శ్రీకాంత్, గైగోలపాడు రాజేంద్రనగర్‌కు చెందిన అన్నదమ్ములు 28 ఏళ్ల వల్లి లక్ష్మణ్‌కుమార్, 30 ఏళ్ల వల్లి రామ్‌కుమార్, రాజమహేంద్రవరానికి చెందిన 37 ఏళ్ల మొండి మహేశ్వర దుర్గాప్రసాద్ ఉన్నారు. వీరంతా పాత నేరస్తులని పోలీసులు గుర్తించారు. జల్సాల కోసమే ఈ దొంగతనాలకు పాల్పడినట్టు విచారణలో తేలిందన్నారు. దోచిన సొత్తును లక్ష్మణ్‌కుమార్ తన అన్న రామ్‌కుమార్ ద్వారా దుర్గాప్రసాద్‌కు పరిచయం అయి, అతడి ద్వారా విక్రయించేవాడని ఎస్పీ తెలిపారు.



దొంగల నుంచి రికవరీ చేసిన ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కష్టమంతా క్షేత్రస్థాయి సిబ్బందిదే..

అధికారుల పర్యవేక్షణలో నేరాలను ఛేదించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది తీవ్రంగా శ్రమించారని ఎస్పీ పాటిల్ పేర్కొన్నారు. డీఎస్పీలు రఘువీర్, శ్రీరామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు పెద్దిరాజు, కృష్ణల పర్యవేక్షణలో, ఎస్సైలు రామకృష్ణ, వినయ్ ప్రతాప్, ఏఎస్ఐలు బలరాం, గోవిందరావు, హెచ్‌సీలు సత్తిబాబు, రాజు,గణేష్, సత్యమూర్తి, చిన్న, వర్మ, కానిస్టేబుళ్లు వెంకటరత్నం, మౌళి, నాయుడు, స్వామి కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించారని ఎస్పీ పేర్కొన్నారు.

కోరుకొండ దేవస్థానంలో రూ. 16 లక్షలు గోల్‌మాల్

విచారణకు ఆదేశించిన ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం: రత్నగిరి దత్తత ఆలయమైన తూర్పుగోదావరి జిల్లాలోని కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించిన విరాళాలు, దేవస్థానానికి వచ్చిన ఆదాయం రూ.16 లక్షలను ఆలయ సిబ్బంది పక్కదారి పట్టించారు. ఇందులో అన్నవరం, కోరుకొండ దేవస్థానాల సిబ్బంది పాత్ర ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు విచారణ జరుపుతున్నట్టు ఈఓ కె.రామచంద్రమోహన్ మంగళవారం రాత్రి 'సాక్షి'కి తెలిపారు. కోరుకొండ ఆలయ వ్యవహారాల పర్యవేక్షణకు అన్నవరం దేవస్థానంలో ఒక గుమస్తా, ఒక సూపరింటెండెంట్, ఏఈఓలతో కూడిన విభాగం ఉంది. కోరుకొండ దేవస్థానంలో వచ్చే విరాళాలకు అక్కడ సిబ్బంది రశీదులు ఇవ్వడంతో పాటు, అక్కడి క్యాష్ బుక్‌లో నమోదు చేయాలి. ఆ వివరాలను ఎప్పటి కప్పుడు అన్నవరం దేవస్థానం సిబ్బంది తనిఖీ చేయాల్సి ఉంది. గత ఏడాదిగా ఆ వివరాలేవీ క్యాష్ బుక్‌లో నమోదు చేయకుండానే రశీదులు ఇచ్చేశారు. అన్నవరం దేవస్థానం ఉద్యోగులు కూడా దీనిని పట్టించుకోలేదు. గత నెల రెండో వారంలో సంబంధిత విభాగ ఏఈఓగా బాధ్యతలు స్వీకరించిన కె.కొండలరావు ఈ అంశాన్ని ఈఓ దృష్టిలో పెట్టారు. దీంతో ఆయన ఈ విషయాన్ని పరిశీలించాలని ఆదేశించగా గత ఏడాది మే వరకు మాత్రమే ఆ దేవస్థానం క్యాష్‌బుక్ అప్‌డేట్‌గా ఉన్నట్టు తేలింది. నమోదు చేయాల్సిన మొత్తం రూ.16 లక్షల వరకు ఉన్నట్లు, దానిలో కొంత మొత్తం ఆ దేవస్థానంలో వివిధ ఖర్చులకు చెల్లించినట్టుగా తేలింది. దుర్వినియోగమైన మొత్తాన్ని రికవరీ చేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఈఓ రామచంద్రమోహన్ తెలిపారు.



కోరుకొండలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం

క్లుప్తంగా

ఆరు కాసుల బంగారు ఆభరణాల చోరీ

అంబాజీపేట: గుడిలో ఉన్న ధర్మ డిబ్బీలో డబ్బులు వేస్తూ అక్కడే పూజ చేసుకుంటున్న ఓ వృద్ధ మహిళ మెడలో ఉన్న బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కముజువారిలంకలో సోమవారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో వినాయకుడి గుడి వద్ద శ్రీపాద సీతారామలక్ష్మి పూజ చేసుకుంటున్నారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి గుడిలోకి వచ్చి అక్కడ ఉన్న ధర్మ డిబ్బీలో డబ్బులు వేశాడన్నారు. పక్కనే పూజ చేసుకుంటున్న సీతారామలక్ష్మి మెడలో ఉన్న నల్లపూసలు, మూడు పేటల తాడు, సూత్రాలు వెరసి ఆరు కాసుల బంగారాన్ని అపహరించుకుపోయాడన్నారు. ఆ సమయంలో ఆమె బిగ్గరగా కేకలు వేసినా ఫలితం లేకపోవడంతో అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై కె.చిరంజీవి పరిశీలించారు. బాధితురాలు సీతారామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు ఈటీసీలో 8వ బ్యాచ్ శిక్షణ ప్రారంభం

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో సుస్థిర లక్ష్యాలకు సంబంధించి బుధవారం నుంచి మూడు రోజుల పాటు 8వ బ్యాచ్‌లో శిక్షణ ప్రారంభం అవుతుందని శిక్షణ కేంద్రం మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 9 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ఎంపిక చేసి జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వాలని సూచించడం జరిగిందన్నారు. ఈ మేరకు ప్రస్తుతం ఆరో బ్యాచ్ శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. ఆరో బ్యాచ్‌లో ఆరోగ్యకరమైన గ్రామం అనే అంశంపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. బుధవారం సాయంత్రంతో శిక్షణ ముగుస్తుందన్నారు. ఏడో బ్యాచ్ గురువారం నుంచి ప్రారంభం కావలసి ఉండగా రెండో శనివారం సెలవు రావడంతో ఒక రోజు ముందుగానే శిక్షణ ప్రారంభిస్తున్నామన్నారు. 7వ బ్యాచ్‌లో సామాజిక న్యాయం, సామాజిక భద్రత కలిగిన గ్రామం అనే అంశంపై శిక్షణ ఉంటుందని చెప్పారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాలోని అధికారులు ఈ శిక్షణకు హాజరవుతారని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం నుంచి 9వ బ్యాచ్ శిక్షణతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల శిక్షణ ముగుస్తుందని చెప్పారు.

పశువులను ఢీకొని లారీ బోల్తా

ఆవు మృతి, మరో గేదెకు గాయాలు

నల్లజర్ల: మేత కోసం వెళ్తున్న పశువుల మందను ఏలూరు నుంచి కొవ్వూరు వైపు వెళ్తున్న సిమెంట్ లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ఒక ఆవు చనిపోగా మరో గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. లారీ అదుపు తప్పి పక్కనున్న పొలాల్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నల్లజర్లకు చెందిన నిమ్మలపూడి ధర్మారావుకు చెందిన పశువులు మేత కోసం వారి పామాయిల్ తోటకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చాటుగా చేరిపో...

- జిల్లా పోలీసు శాఖలో వింత పోకడలు
- చాటుమాటుగా సీఐల చేరికలు
- గతంలో ఎన్నడూ లేని వైనం




కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయం

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లాలోని పోలీసుల తెర చాటు చేరికలు పలు సందేహాలకు తావిస్తున్నాయి. పోలీసుశాఖలో దిగువ కేడర్‌కు చెందిన పోలీసుల చేరికలంటేనే పెద్ద తతంగం నడుస్తుంటుంది. అటువంటిది జిల్లాలోని పలువురు ఇన్‌స్పెక్టర్లకు బెర్తుల కేటాయింపులు ఇందుకు భిన్నంగా సొంత జాగీరులా నడుస్తున్నాయనే చర్చ పోలీసు శాఖలో గుప్పుమంటోంది. ఇటువంటి చేరికల వెనుక మర్మమేంటన్న ప్రశ్న సామాన్యులనే కాకుండా పోలీస్ సర్కిళ్ల స్థాయిలోనే తొలిచేస్తోంది.

కారణమేమిటో..

ఉన్నత స్థాయిలో ఉన్న అధికారి విధుల్లో చేరుతున్నాడంటే అది సదరు అధికారికి ఎంతో గర్వకారణం. విధుల్లో చేరే తొలి రోజు సంప్రదాయబద్ధంతా పూజాపునస్కారాలు, ప్రజల నమస్కారాలు, స్టేషన్ సిబ్బంది మనస్పూర్వక ఆహ్వానాలు అట్టహాసంగా కనిపిస్తుంటుంది. ఇలా హుందాగా ప్రజలందరికీ తెలిసి చేరాల్సిన అధికారికి చాటుగా చేరే గత్యంతరం ఎందుకొచ్చిందనే ప్రశ్నలకు జవాబు దొరకని చేరికలు ఇటీవల కాకినాడ జిల్లాలో జరిగాయి. ఒక్క ఆర్డర్ లేకుండానే సర్కిల్ స్థాయి అధికారులు విధుల్లో చేరిపోతున్న వ్యవహారాలు ఆ శాఖలో హాట్‌టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం జిల్లాలో చోటు చేసుకుంటున్న చీకటి చేరికలు ఎందుకిలా అన్నది బిలియన్ డాలర్ల ప్రశ్నగా కనిపిస్తోంది. ఈ గందరగోళం వెనుక విస్తుపోయే వాస్తవాలు దాగి ఉన్నాయని పోలీసు వర్గాల్లో కోడై కూస్తోంది.

ఫలానా అధికారి అని పేర్లు అధికారికంగా ప్రకటించే సరికి స్థానిక ప్రజలు అప్రమత్తమవుతున్నారు. సదరు అధికారి అవినీతి అక్రమార్కుడైతే అతడి రాకను ప్రజలే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మీడియా కథనాలు అధికారి పుట్టుపూర్వోత్తరాలు, అవినీతి బాగోతాలను వండి వార్చుతుంటే ప్రజలు నిర్ఘాంతపోతున్నారు. దీంతో ఉన్నతాధికారులకు సదరు అవినీతి అధికారులను అక్కడి నుంచి తప్పించక తప్పనిసరి పరిస్థితి ఎదురవుతోంది. అప్పటికే నాయకులు, ఉన్నతాధికారులకు రూ.లక్షల మొత్తాలు ముట్టజెప్పి, భారీ వ్యయాలతో సీట్లు కొంటున్న సీఐలకు మీడియా, ప్రజలు ఇస్తున్న షాక్‌తో గొంతులో వెలక్కాయ పడ్డంత పనవుతోంది. 'కుర్చీలాట... కాసుల వేట' శీర్షికతో రూ.లక్షల లంచాలిచ్చి చేరిన అధికారుల బాగోతాలు, అవినీతి చిట్టాలు ప్రస్తావిస్తూ 'సాక్షి'లో గత నెల 7న వెలువడిన కథనం ప్రకంపనలు సృష్టించింది. ఉలిక్కిపడ్డ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఎంచుకున్న మరో మార్గమే ఈ చీకటి చేరికలంటున్నారు.



జిల్లాలో చడీచప్పుడు కాకుండా ఐదుగురు పోలీసులు పలు స్థానాల్లో చేరిపోయారు. కాకినాడ సీసీఎస్‌లో కృష్ణ, కాకినాడ డీటీసీ నుంచి సామర్లకోట సీసీఎస్‌కు అటాచ్‌మెంట్‌లో అంకబాబు, ప్రత్తిపాడు సూర్యఅప్పారావు, సామర్లకోట కృష్ణభగవాన్, కాకినాడ ట్రాఫిక్ 2లో రామారావు ఇలా.. ఐదుగురు అధికారులు చేరిపోయారు. ఇలా చేరిన వారిపై గతంలో పనిచేసిన ప్రాంతాల్లో వివాదాస్పదులనే పేరుపడ్డారు. వాటి ఆధారంగానే సస్పెన్షన్లు, బదిలీలు కూడా అప్పట్లో జరిగాయి. అటువంటి వారిలో కృష్ణపై భవానీపురం భూ వివాదం, రావులపాలెం ఇసుక మాఫియా, అంకబాబుపై గంజాయి వ్యవహారం, సూర్య అప్పారావు రైస్ పుల్లింగ్ వ్యవహారంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇలాంటి వివాదాస్పదులైన ఇన్‌స్పెక్టర్‌లు చడీచప్పుడు కాకుండా జరిగిన చేరికలపై అధికారులు ఏమని సమాధానం చెబుతారనే ప్రశ్న పోలీసు వర్గాల నుంచే వినిపిస్తోంది.

వాగులో పడి మహిళ మృతి

కోటనందూరు: ప్రమాదవశాత్తూ వాగులో పడి మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. వివరాల్లోకెళితే.. మండలంలోని కొత్తకొట్టాం గ్రామానికి చెందిన కోరుమిల్లి అప్పలరాజు (60) గ్రామంలో ఉన్న కండి వాగులోకి దిగింది. బట్టలు బాదే బల్లను సరిచేసే క్రమంలో అదుపుతప్పి వాగులో పడిపోయి మృతి చెందింది. గ్రామస్తులు మృతదేహాన్ని వెలికి తీశారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్సై సంఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో..

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా పరిషత్ కూడలిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ కచేరిపేటకు చెందిన బర్రే గంగాద్రి (52) జిల్లా పరిషత్ కూడలిలో నడుచుకుంటూ వెళ్తుండగా సామర్లకోట నుంచి వార్ఫు రోడ్డు వైపు వెళ్తున్న రాజస్తాన్‌కు చెందిన లారీ గంగాద్రిని ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మృతుడు శరీరం నుజ్జునుజ్జయింది. ఘటనపై కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే మరో ప్రమాదంలో కాకినాడ జగన్నాథపురంలో మంగళవారం చోటు చేసుకున్న కారు ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. అన్నమఘాటీ నుంచి జగన్నాథపురం వైపు వస్తున్న కారు యువకులు ఇద్దరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. క్షతగాత్రులను స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ..

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీకి చెందిన పోలిశెట్టి రమేష్ కుమార్(45) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు రమేష్‌కుమార్ అప్పుల బాధ తాళలేక ఈ నెల 5న పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని గుర్తించి స్థానికులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముమ్మరంగా గాలింపు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం గండి చెరువులో ధుమంతునిగూడెం పంచాయతీ పరిధిలోని సుబ్బరాయపురానికి చెందిన సీహెచ్ శాంతారావు గల్లంతైనట్టు అనుమానిస్తున్న పోలీసులు ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం చెరువు వాగుపై ఉన్న వంతెన వద్ద బైక్‌ను స్థానికులు గుర్తించారు. బైక్‌ను పరిశీలించగా దానిలో సెల్‌ఫోన్, పర్సు ఉంది. పర్సును పరిశీలించగా దానిలో ఇండియన్ టుబాకో అసోసియేషన్ జారీ చేసిన ఐడీ కార్డు ఉన్నాయి. ఐడీ కార్డులో చిరునామా ఆధారంగా శాంతారావు వాగులో గల్లంతైనట్టు భావించి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేవరపల్లి ఎస్సై కె.సుబ్రహ్మణ్యం మంగళవారం సంఘటన స్థలానికి చేరుకుని, గజ ఈతగాళ్లతో వాగులో ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలింపు జరిపారు. అయినా వ్యక్తి ఆచూకీ లభించలేదు. యర్నగూడెం సెంటర్లోని సీసీ ఫుటేజీలను ఎస్సై పరిశీలించారు. శాంతారావు వాగులో గల్లంతయ్యాడా? లేదా అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.



యర్నగూడెం గండి చెరువు వాగులో శాంతారావు కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

కర్మఫల రూపమే అదృష్టం

- సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ
- నేటితో ముగియనున్న ప్రవచనాలు



సామవేదం షణ్ముఖశర్మ

రాజమహేంద్రవరం రూరల్: అదృష్టమంటే కనపడనిది, కర్మఫలరూపమే అదృష్టమని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. మంగళవారం కొంతమూరులోని వల్లభగణపతి ఆలయం వద్ద ఉన్న ప్రవచన మందిరంలో ఆయన ఆరో రోజు కల్కి వైభవంపై ప్రవచనాన్ని కొనసాగించారు. పుణ్యకర్మల ఫలమే సౌభాగ్యం, చెడు కర్మల ఫలమే దౌర్భాగ్యమని ఆయన అన్నారు. మ్లేచ్ఛాదులను అంతమొందించడానికి, వేద ధర్మరక్షణకు, ధర్మసేతువును రక్షించడానికి కల్కి అవతరిస్తాడు. అయితే, విషయవాంఛలను అధిగమించలేనివాడు విష్ణువును తెలుసుకోలేడు. స్త్రీ వ్యామోహం, ధనలోభం ఎండమావుల వంటివేనని సామవేదం అన్నారు. స్వప్నంలో భగవత్ సాక్షాత్కారం కూడా సులభం కాదని రామకృష్ణపరమహంస అన్నారు. స్వప్న సాక్షాత్కారాన్ని కల అని తీసిపడవేయరాదని ఆయన అన్నారు. వైరాగ్యం లేనిదే భక్తి కలగదు, అయితే వైరాగ్యం కలిగితే ముక్తి సిద్ధించినట్లు కాదు, సాధనకు వైరాగ్యం అర్హత మాత్రమేనని అన్నారు. గురువు కూడా తరించడానికి మార్గం చూపేవాడే కానీ, ముక్తిని ఇచ్చేవాడు కాదని తెలుసుకోవాలని సామవేదం అన్నారు. ముందుగా భాగవత విరించి డాక్టర టీవీ నారాయణరావు స్వాగతవచనాలు పలికారు. ఈనెల 5వ తేదీన ప్రారంభమైన కల్కి అవతార వైభవంపై ప్రవచనాలు బుధవారంతో ముగియనున్నాయి. బుధవారం సాయంత్రం 5 గంటలకు రాధాదేవి జన్మదిన వేడుకలు జరుగుతాయి. గురువారం సాయంత్రం ఆలయంలో వల్లభగణపతి శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. శుక్రవారం మహాపూర్ణాహుతి, అవభృథస్నానంతో నవరాత్ర ఉత్సవాలు పూర్తవుతాయి.

13న గ్రంథావిష్కరణ, విద్వత్ సన్మానం

శ్రీసామవేదం రామమూర్తి శర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు బ్రహ్మశ్రీ సామవేదం రామమూర్తి శర్మ రచించిన పద్యకావ్యం 'శ్రీధ్రువచరితమ్' ఆవిష్కరణ సభ జరుగుతుందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సామవేదం షణ్ముఖ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ప్రవచన రాజహంస డాక్టర్ ధూళిపాళ మహాదేవమణిని సత్కరించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలు వల్లభగణపతి మంటపం సమీపంలోని మహాదేవానంద సభాప్రాంగణంలో జరుగుతాయని, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు తదితరులు పాల్గొంటారని ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రగతిలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీ ప్రారంభం

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ క్యాంపస్‌లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీని మంగళవారం ప్రారంభించినట్టు చైర్మన్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ స్కిల్స్‌తో యువతను శక్తివంతం చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఇంటెన్సివ్ ట్రెనింగ్ ప్రోగ్రాం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ రంగంలో డిమాండ్‌కు తగ్గ నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం ద్వారా ఉపాధిని మెరుగుపరచడానికి దీనిని రూపొందించినట్టు తెలిపారు. కార్యక్రమం ప్రారంభానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐసీటీ అకాడమీ అధినేత ఎస్.దినకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పరిశ్రమల భవిష్యత్తును రూపొందించడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. పోటీతత్వ జాబ్ మార్కెట్ కోసం విద్యార్థులను సిద్ధం చేయడంలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

ఆహ్వాన పత్రం అందజేత

అమలాపురం టౌన్: అమలాపురం ఆఫీసర్స్ రీక్రియేషన్స్ క్లబ్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న 11వ ఆంధ్రప్రదేశ్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ప్రత్యేక అతిథిగా హాజరు కావాలని కోరుతూ కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్‌కు అసోసియేషన్ ప్రతినిధులు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసి ఆహ్వానించారు. పవర్‌లిఫ్టింగ్ కోచ్‌లు కంకిపాటి వెంకటేశ్వరరావు, మట్టపర్తి సముద్రం, వ్యాయామ ఉపాధ్యాయుడు సుధీర్, నేషనల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి పి.వందన, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై వృద్ధుడి లైంగికదాడి

రాజోలు: అభం..శుభం తెలియని తొమ్మిదేళ్ల చిన్నారిపై వేగివారిపాలేనికి చెందిన వృద్ధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ నెల 7న వినాయక చవితి రోజున జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం బాలిక సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజోలు ఎస్సై బి.రాజేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్నేహితులతో కలసి ఆడుకుంటున్న నాలుగో తరగతి చదువుతున్న వేగివారిపాలేనికి చెందిన చిన్నారిని అదే గ్రామానికి చెందిన 71 ఏళ్ల పితాని సత్యనారాయణ చాక్లెట్ ఇస్తానని చెప్పి ఇంట్లోకి తీసుకువెళ్లి తలుపు గడియపెట్టాడు. బాలిక ధరించిన డ్రస్‌ను తీసివేసి వృద్ధుడు ఒంటిపై వస్త్రాలు లేకుండా చిన్నారిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంతలో వృద్ధుడి మనవడు, ఇతర పిల్లలు తలుపులు గట్టిగా కొట్టడంతో చిన్నారి ఏడుస్తూ బయటకు వచ్చి ఇంటికి వెళ్లిపోయింది. చిన్నారి తల్లి మూగ కావడంతో జరిగిన సంఘటన ఎవరికీ చెప్పలేకపోయింది.

విద్యుత్ షాక్ బాధితురాలికి రూ.2.06 లక్షల సాయం



గొందిలో బాధిత విద్యార్థిని కుటుంబానికి సాయం అందజేస్తున్న ఎస్టీయూ ఉపాధ్యాయులు

సఖినేటిపల్లి: మండలంలోని గొందిలో విద్యుత్ షాక్ బాధిత జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బర్రే దుర్గా భవాని చికిత్సకు విద్యార్థులు, ఉపాధ్యాయులు వేర్వేరుగా మొత్తం నగదు రూ.2,06,770 అందజేశారు. మంగళవారం సదరు మొత్తాన్ని ఎస్టీయూ ఉపాధ్యాయులు బాధిత బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. అలాగే అంతర్వేది దేవస్థానానికి చెందిన శ్రీలక్ష్మీనరసింహ అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం రూ.25,900 మంగళవారం అందజేసింది. ఈ నగదును కాకినాడలో ఆస్పత్రి వద్ద బాలిక తండ్రి చక్రవర్తికి అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా బియ్యపుతిప్పకు చెందిన సంగాని నాగరాజు, సంగాని కృష్ణ రూ.5 వేల వంతున ఇచ్చారు.

రెండు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో విజిలెన్స్ సిబ్బంది

కడియం: కడియం మండలం వీరవరంలో అక్రమ పీడీఎస్ బియ్యం నిల్వలపై విజిలెన్స్ అధికారులకి సమాచారం రావడంతో మంగళవారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో రేషన్ బియ్యం 2,077 కేజీలు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటుగా ఈ రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన ఏపీ 05 టీఎం 0397 టాటా ఏస్ వాహనం, ఎటువంటి అనుమతులు లేకుండా వినియోగిస్తున్న ఒక కాటాను సీజ్ చేశారు. అక్రమ రేషన్ బియ్యం రవాణా చేస్తున్న పసలపూడి గంగరాజు, పాబోలు గణపతిలపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ టి.నాగ వెంకటరాజు తెలిపారు. ఈ దాడుల్లో డీటీ నాగలక్ష్మి, విజిలెన్స్ కానిస్టేబుల్ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చని సిరులు

- పచ్చ పీతల సాగుతో కాసుల పంట
- పర్రభూములు ఎంతో అనుకూలం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



చిర్రయానంలో పీతల పెంపకంపై రైతులకు సలహాలు ఇస్తున్న మత్స్యశాఖ డీడీ విజయభారతి (ఫైల్)

కాట్రేనికోన: పీతల చెరువుల పెంపకంలో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని విశ్రాంత కాకినాడ మత్స్యశాఖ డీడీ రామ్మోహనరావు అన్నారు. పీతల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తే సిరులు పంట కాగలదని పీతల సాగు చేస్తున్న రైతులు అంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 971 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. కోస్తా తీరం వెంబడి వేలాది ఎకరాల ఉప్పు నీటి కయ్యలు, పర్రభూములు నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో టైగర్ రొయ్యలు సాగులో వైరస్ వ్యాధులు విజృంభించడంతో సముద్ర తీరం వెంబడి పర్ర భూముల్లో చెరువులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఉప్పు నీటి పర్రభూములు పచ్చపీతలు, మండ పీతల పెంపకానికి అనుకూలంగా ఉంటాయి. ఈ ప్రాంతంలో పచ్చ పీతల పెరుగుదల అధికంగా ఉంటుంది. పచ్చ పీతలకు విదేశీ మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉంది. ఉప్పునీటి పర్ర భూముల్లో పీతల సాగును ప్రోత్సహించేందుకు గతంలో మత్స్యశాఖ కమిషనర్ రాంశంకర్ నాయక్ నీళ్లరేవు, చిర్రయానం గ్రామాల్లో పర్యటించి పీతల సాగు చేస్తున్న రైతులతో సమావేశమయ్యారు.

యాజమాన్య పద్ధతులు

రైతులు పీతల చెరువు తయారీకి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. చెరువు మట్టి పరీక్షల ఆధారంగా టెక్నికల్ సిబ్బంది సలహా మేరకు సున్నం, జిప్సం, బ్లీచింగ్ పౌడర్లను చల్లించాలి. చెరువు లోతు కనీసం మూడడుగులు తగ్గకుండా ఉండాలి. చెరువులోకి ఇతర చేపలు, రొయ్యల పిల్లలు రాకుండా నీటిని పెట్టేటపుడు మెష్ కట్టి వడగట్టిన నీటిని మాత్రమే చెరువుకు తోడుకోవాలి. చెరువులోకి వ్యాధి కారక జీవులు ప్రవేశించకుండా చిక్కటి మెష్‌తో దశల వారీ ఫిల్టర్ చేసిన నీటిని మాత్రమే తోడవలసి ఉంది. నీటి నాణ్యత పద్ధతులను పాటించి, సేంద్రియ పదార్థాలు పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు. సేంద్రియ పదార్థాలు పేరుకుంటే ప్రొటోజోవా, ఇతర పరాన్న జీవులు పీతల బాహ్యకవచంపై చేరి పాకుడు ఏర్పడుతుంది. పాకుడు వ్యాధితో పీతలు మేతను సక్రమంగా తీసుకోలేక బలహీనంగా ఉండి గుల్ల విడవలేకపోవడం, మృత్యువాత పడటం జరుగుతుంది.

బయో సెక్యూరిటీ తప్పనిసరి

చెరువులోని పీతలు బయటకు పోకుండా, చెరువు బయటి ఇతర జీవులు లోపలికి రాకుండా చెరువు చుట్టూ గట్టుపై మెష్‌ను బయో సెక్యూరిటీగా ఏర్పాటు చేయాలి. చెరువు చుట్టూ బయో సెక్యూరిటీగా కట్టిన మెష్‌లతో ఇతర చెరువుల నుంచి వ్యాధికారక పీతలు, తాబేళ్లు వంటి జీవులతో వ్యాధులు వ్యాప్తి చెందకుండా రక్షణ ఉంటుంది. బయో సెక్యూరిటీతో వ్యాధుల నుంచి రక్షణతో పాటు చెరువులోని పీతలు బయటకు వెళ్లిపోకుండా ఉంటుంది.

సీడ్ సేకరణ

పచ్చ పీతల సాగు కోసం హేచరీల నుంచి, సంప్రదాయ పద్ధతిలో సీడ్‌ను సేకరిస్తున్నారు. పచ్చ పీతలు సాగు చేసేందుకు అవసరమైన సీడ్‌ను చెన్నై హేచరీల నుంచి తీసుకువస్తున్నారు. స్థానికంగా గోదావరి పాయలు, పర్రభూముల నుంచి పీత సీడ్‌ను సేకరిస్తున్నారు.

పీతల పెంపకం- వివిధ పద్ధతులు

సంప్రదాయ పద్ధతి, బాక్స్ కల్చర్ పద్ధతి

సంప్రదాయ పద్ధతిలో 50–100 గ్రాముల సైజు పీత పిల్లలను హెక్టార్‌కు 500–1000 వేసి ఎదుగుదల ఆధారంగా దశల వారీగా పట్టుబడి చేయాలి. పంట కాలం సుమారు 6–7 నెలల్లో 800 నుంచి 1200 గ్రాములు, ఏడాది లోపు 1800 గ్రాములు, 2 కేజీలు (ఎక్స్ఎల్) సైజ్ వరకు ఎదుగుతుంది. గుల్ల గట్టిపడిన పీతలను 500 గ్రాములు బరువు వచ్చినప్పటి నుంచి మార్కెటింగ్ చేసుకోవచ్చు. ఈ పద్ధతిలో పీతలు బతుకుదల శాతం 35–40 శాతం మాత్రమే ఉంటుంది. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం బాక్స్ కల్చర్‌ను డెమో ప్రాజెక్టుగా పల్లంలో చేపట్టింది. బాక్స్ కల్చర్ విధానంలో పీతల సాగు సమయం ఆలస్యమైనా బతుకుదల శాతం అధికంగా ఉంటుంది. ఇతర దేశాల్లో ఈ పద్ధతి విజయవంతమైనా మనకు సక్సెస్ కాలేదు.

వాటర్ పీతల పెంపకం

పీతల పెంపకంలో గుల్ల గట్టిగా లేని పీతలను నీటి పీతలు అంటారు. వీటిని గుల్ల గట్టిబడే వరకు పెంపకం చేయడాన్ని క్రాబ్ ఫాటనింగ్ అంటారు. దీనిని సంప్రదాయ పద్ధతి, బాక్స్ పద్ధతిలో చేపట్టవచ్చు. ఈ పీతలను నెల రోజుల్లోపు పట్టుబడి చేయవచ్చు.

మేత అందించే విధానం

పీతలకు కృత్రిమ మేతలు మార్కెట్‌లో అందుబాటులో లేవు. పీతలు మాంసాహారి కావడంతో స్థానికంగా దొరికే చిన్న చిన్న చేపలను, నత్త గుల్లలను ఆహారంగా అందిస్తున్నారు. మేతలను రోజుకు మూడు సార్లు అందిస్తూ అధిక శాతం సాయంత్రం వేళ వేయాలి. చెరువులోని పీతల సరాసరి బరువులో 6 శాతం తాజా మేత అందించాలి. మేతను అవసరమైనంత మాత్రమే ఇవ్వాలి. అధికంగా మేతను చెరువులో వేయడంతో నీటిలో కుళ్లిపోయి నీరు కలుషితం అవుతుంది. వ్యాధులు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి.

ప్రోత్సాహం అందిస్తే సిరులు

పీతల సాగు చేస్తున్న రైతులకు అవసరమైన సీడు, సాగుపై సాంకేతిక సలహాలు మత్స్య శాఖ అందిస్తే పీతల సాగు సిరు పంటగా నిలుస్తుందనటంలో అతిశయోక్తి లేదు. పీతల సాగులో వచ్చే వ్యాధులు నిర్మూలన, సాగు పద్ధతులపై అవగాహన కల్పించక పోవడంతో రైతులు సాగు చేయలేక పోతున్నారు. పీతల సాగుపై మత్స్యశాఖ నుంచి ప్రోత్సాహం లేకపోవడం, సాంకేతిక సలహాలు అందించక పోవడంతో రైతులు పీతల సాగును చేయలేకపోతున్నారు.

షెల్టర్లు ఏర్పాటు చేయాలి

పీతలు స్వజాతి భక్షణ (కెనబాలిజం) కలిగి ఉండటంతో గుల్ల విడిచే సమయంలో మెత్తటి పీతలను గట్టి పీతలు తినేయడంతో బతుకుదల శాతం తగ్గిపోతుంది. పీతలు గుల్ల కొట్టే సమయంలో రక్షణ కోసం పైపు ముక్కలు, పొడైన మట్టికుండలు, చెట్టు కొమ్మలను షెల్టర్స్‌గా ఏర్పాటు చేయాలి. ఈ ప్రదేశాలు ఏర్పాటు చేయడంతో పీతలు గట్టి పడేంత వరకు రక్షింపబడతాయి.

– డా. టి.విజయభారతి, మత్స్యశాఖ డీడీ

పీతలకు వచ్చే వ్యాధులు

పీతలకు ప్రస్తుతం వస్తున్న వ్యాధులు పాకుడు వ్యాధి, గుల్ల రంగు మారిపోవడం, మొప్పలు కుళ్లిపోవడం, మొప్పలపై పరాన్న జీవులు పేరుకుపోవడం, మొప్పల రంగు, గుల్లరంగు మారిపోవడం, పీతల శరీరంలో మాంసం లేకుండా నీరు మాత్రమే ఉండటం (కండర క్షీణత) వంటి ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. మేతలు వృథా కావడంతో చెరువు నీరు చిక్కబడి నాణ్యత లోపించడం, విషవాయువులు ఉత్పత్తి కావడంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. కాబట్టి చెరువు మేత, నీటి యాజమాన్యత, బయోసెక్యూరిటీ, వంటి అంశాలను రైతులు విధిగా పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

– రామ్మోహనరావు, మత్స్యశాఖ మాజీ డీడీ, కాకినాడ